నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 26 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET

## ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు..

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : ప్రజల ఆశలపై బడ్జెట్ పూర్తిగా నీళ్లు చల్లిందని, ఈ బడ్జెట్‌కు ఏ మాత్రం దశ, దిశ లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సబ్బండ వర్గాల ప్రజలందరినీ బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారు. దళితబంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలకు చరమగీతం పాడారు. ఇటు రైతుల పరంగా చూసినా పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. రైతుబంధును కూడా మూసేస్తున్నట్టు చెప్పకనే చెబుతున్నారు. మహిళలకు రూ.2,500 మహాలక్ష్మి మాయమైందని, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా దూరమైందన్నారు. ఇక నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఆశ లేకుండా పోయిందన్నారు. బడ్జెట్‌లో రైతుకూలీల జాడెక్కడని, కౌలు రైతుల ఊసే లేదన్నారు. సబ్బండ వర్గాల ఆశల మీద నీళ్లు చల్లిన బడ్జెట్ ఇది. కాంగ్రెస్ చేసిన మోసాలకు సమయం వచ్చినప్పుడు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

## ఆశాజనకంగా లేదు..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు చాలా ఆశలు చూపించింది. కానీ ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే ప్రజలకు ఆశ కల్పించే విధంగా లేదు. అంకెలగారడీని ప్రదర్శించి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. దళితులకు కేసీఆర్ ప్రభుత్వం పెట్టిన స్కీమ్‌లను ఈ ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ఈ బడ్జెట్‌లో కార్యరూపం దాల్చు తోందని ప్రజలు ఎదురు చూశారు. ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ఉన్నా జిల్లాకు ఒరిగిందేమీలేదు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం పథకాల్లో కూడా కోతలు పెడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనబడింది. ఈ బడ్జెట్‌తో రాష్ట్ర అభివృద్ధి కూడా కుంటుపడే అవకాశం ఉంది.

*- బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే*

## మేనిఫెస్టోని మరిచిన బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది ప్రజావ్యతిరేక బడ్జెట్. ఎన్నికల మేనిఫెస్టోను కూడా మరిచిపోయింది. నిరుద్యోగ భృతి, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు, రేషన్ కార్డుల అంశాన్ని ప్రస్తావించలేదు. దళితులను, గొల్లకురుమలను విస్మరించింది. కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు, గొర్రెల పంపిణీతో దళితులు, కుర్మల్లో ఆర్థిక స్థిరత్వం వచ్చింది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గం. ఈ బడ్జెట్ ప్రజాపాలనకు ప్రతిబింబంగా కాదు పేదవర్గాల సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చింది. అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విషయం ఈ బడ్జెట్ ద్వారా తెలిసి వచ్చింది. బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్ ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రజాపాలన అని చెప్పుకునే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు.

*- బైకని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి*

## కేంద్రం గాడిద గుడ్డు.. రాష్ట్రం గుండు సున్న ఇచ్చాయి..

- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లపై మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి



నారాయణపేట, జూలై 25 : బడ్జెట్ కేటాయింపులో కేంద్రం తెలంగాణకు గాడిద గుడ్డు ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం తాను ఏమీ తక్కువ కాదు అన్నట్లుగా జిల్లాకు గుండు సున్నా ఇచ్చిందని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో మరోసారి ప్రజలను మోసం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఆరు గ్యారెంటీ లను అమలు చేయకపోగా బడ్జెట్‌లో వాటికి నిధుల కేటాయింపు కూడా చేయలేదన్నారు. ప్రతి మహిళకు రూ. 2,500, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం, పంటకు రూ. 500 బోనస్, రూ.2016 నుంచి రూ.4000కు పెన్షన్ పెంచి ఇస్తామని చెప్పినా వాటికి బడ్జెట్‌లో ఎక్కడా నిధుల కేటాయింపు చేయలేదని ఆరోపించారు. అంతేకాకుండా పాలమూరు - రంగారెడ్డిలో భాగంగా తమ హయాంలో నారాయణపేట మెయిన్ కెనాల్‌కు టెండర్లు పూర్తి కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, నారాయణపేట మెయిన్ కెనాల్ నిర్మాణానికి నిధులు కేటాయింపు లేదని, నూతన జిల్లా దవాఖాన భవనంలో నే మెడికల్ కళాశాల నిర్వహిస్తున్నారని, నూతన మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధుల కేటాయింపు ప్రస్తావన లేదని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిధుల కేటాయింపు లేదని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిపిస్తే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా తెస్తామని, నారాయణపేట జిల్లాకు రైల్వే లైన్, నవోదయ, సైనిక్ స్కూల్ తీసుకొస్తామని ఎన్నికల సమయంలో పెద్ద పెద్ద ప్రగల్భాలు పలికిన బీజేపీ నాయకులు నేడు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకున్నా ఎందుకు నోరు విప్పడం లేదని ఆయన ప్రశ్నించారు.



# పాలమూరుకు శూన్యహస్తం

## అంకెల గారడీలా రాష్ట్ర బడ్జెట్

- రైతులు, కులవృత్తిదారులకు మంగళం
- ఊసేలేని గొర్రెలు, దళితబంధు పథకాలు
- కనిపించని పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం
- పాలమూరు ఎత్తిపోతల, పర్యాటక రంగానికి చోటేదీ?

నాగర్‌కర్నూల్, జూలై 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా మారింది. ఆరు గ్యారెంటీల హామీతో అంకెల గారడీతో పసలేని బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, వృత్తిదారులకు, సంక్షేమానికి, వెనుకబడిన వర్గాల ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈ బడ్జెట్ అంకెల గారడీగా.. అప్పులు పత్రంగానే మారిందని, పలువురు రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**అంకెల గారడీ.. సంక్షేమం మిథ్య**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా మారిందనే అభిప్రాయం మేధావుల వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన అంటూ రోజూ వినిపించే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అడుగడుగున బడ్జెట్ సాక్షిగా తిలోదకాలిచ్చినట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర బడ్జెట్ రూ.2.91లక్షల కోట్లు ఉండగా వ్యవసాయానికి రూ.72వేల కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్ ఏప్రిల్ నుంచి ప్రారంభం కాగా రైతు రుణమాఫీకే రూ.30వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఇక రైతు భరోసా, ఇతర పథకాలకు రూ. 20వేల కోట్ల మేర ఖర్చు అవుతుంది. దీంతో మిగిలిన రూ.20వేల కోట్లు మాత్రమే వ్యవసాయానికి కేటాయించినట్లుగా బడ్జెట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇక వృత్తిదారులు, విద్యాభరోసాపై ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, ఆటో డ్రైవర్ల గురించి కూడా పేర్కొనలేదు. మహిళలక్ష్మి, పింఛన్ల పెంపు ప్రస్తావించలేదు. పాలమూరులో ప్రతిష్ఠాత్మకంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపుగా 80 శాతంపైగా పూర్తి చేసింది. కల్వకుర్తి ఎత్తిపోతలను కూడా 2025వరకు పెండింగ్ పనులను పూర్తి చేస్తామని, ఉమ్మడి పాలమూరులోని నారాయణపేట, ఇతర ఎత్తిపోతల పథకాలను చేపడతామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మారాయన్న విమర్శలు జిల్లా రైతాంగం నుంచి వినిపిస్తున్నాయి. ప్రతిష్ఠాత్మక పాలమూరు ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ ప్రస్తావించేందుకు అంతగా ఇష్టపడని ప్రభుత్వం బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వకపోవడంపై జిల్లా రైతన్నల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. విప్లవాత్మకమైన దళితబంధును సైతం ప్రస్తావించలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకానికి రూ.50 వేల కోట్లను కేటాయిస్తే దళితులకు రూ.30వేల కోట్లుగా పెంచకుండా విస్మరించారనే భావన వ్యక్తమవుతోంది. వృత్తిదారులైన గొల్ల కురుమలకు అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకాన్ని విస్మరించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇక మత్స్యకారులకు భరోసా చేయ చిక్కలేదు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు దూరంగా ఈ బడ్జెట్ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేషన్ కార్డుల గురించి పేర్కొనలేదు. జాబ్ క్యాలెండర్, 2లక్షల ఉద్యోగాలు, రూ.4వేల నిరుద్యోగ భృతిని కూడా పేర్కొనలేదు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామన్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టోలో పేర్కొన్నా ఆటో డ్రైవర్లను విస్మరించడం గమనార్హం. వాస్తవాలకు దూరంగా ఈ బడ్జెట్ ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇటీవలే నల్లమలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అటవీ ప్రాంతంలో మంత్రుల బృందం పర్యటించింది. కానీ ఏం చేస్తామని, ఎంత నిధులు కేటాయిస్తారో స్పష్టత ఇయ్యలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏం చేస్తామో ఈ బడ్జెట్ స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం విస్మరించి, అభివృద్ధికి దూరంగా, అప్పుల పత్రానికి దగ్గరగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలకు ప్రాధాన్యతగానే మిగిలిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణ బడ్జెట్ అంకెల గారడీ : గువ్వల బాలరాజు



కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్పా ఆరు గ్యారెంటీల అమలుకు ఊసే లేదు. బడ్జెట్ కేటాయింపులకు ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందో లెక్కాపత్రం లేదు. ఇది రైతుశత్రు ప్రభుత్వం. ఈ ప్రభుత్వం ఒక్క పాలసీ రూపొందించలేదు. ఏ ఒక్కదానిపై క్లారిటీ లేదు. గొర్రెల పంపిణీ, దళితబంధు, గిరిజనబంధు, కొత్త పింఛన్లు, ఉద్యోగాలు, మహిళలకు రూ.2500 మహాలక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు, ఆటోకార్మికుల, కౌలు రైతులు పరిశ్రమల గురించి ఊసేలేదు. ఏ ఒక్క వర్గానికి బడ్జెట్‌లో పేర్కొనలేదు. రైతు భరోసా పథకం గురించి చెప్పలేదు. కొత్త ఉద్యోగాలకు సంబంధించి కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించలేదు. కేవలం అధికారం కోసం సాధ్యంకాని హామీలు ఇచ్చి చేతులు దులుపుకొన్నది. బడ్జెట్ చూస్తే అప్పుల ఊబి తప్పా మరేమీలేదు. అటలు బడ్జెట్ మాదిరిగా లేదు, కాగితంపైన రాసుకొచ్చి చదివినట్టు ఉన్నది. క్యాబినెట్‌లో ఉన్న ఎవరికీ అనుభవం లేదు. కాంగ్రెస్ చేసిన మోసపూరిత మాటలు ఈ బడ్జెట్ ద్వారా బయటపడ్డాయి.

## ఇది ప్రజావ్యతిరేకమైనది..



కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పటి వరకు రైతులకు వరమనుకుంటున్న రైతుభరోసాపై కోతలు విధిస్తున్నట్లు చెప్పారు. అనేక పథకాలకు తిలోదకాలు ఇచ్చారు. అన్ని వర్గాలను ప్రజలను మోసం చేసింది. ఇది మొత్తంగా ప్రజావ్యతిరేక బడ్జెట్‌లా ఉంది. కాంగ్రెస్ బడ్జెట్ అందరినీ నిరాశపర్చింది.

*- బాసు హనుమంతు, బీఆర్‌ఎస్ నేత, గద్వాల జిల్లా*

## ప్రజలకు ఉపయోగపడేలా లేదు..



రాష్ట్ర బడ్జెట్ అంకెల్లో బాగుంది. కానీ ప్రజలకు ఉపయోగపడేలా లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయడానికి బడ్జెట్‌లో నిధుల రూపకల్పన చేయలేదు. ఈ బడ్జెట్ పూర్తిగా రైతు, బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఉంది. గత ప్రభుత్వం రెండు విడతల్లో రైతులకు రైతుబంధు ఇస్తే ఈ ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు కేటాయించిందే తప్పా ఈ పథకానికి ఇన్ని నిధులు కేటాయిస్తున్నామని ఎక్కడా వివరాలు పేర్కొనలేదు. రైతుబంధును ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నది. రోడ్ల అభివృద్ధికీ అనుకున్న స్థాయిలో నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు ఒక పాలసీ లేదు. ఇది పూర్తిగా తెలంగాణ ప్రజలను వంచించే బడ్జెట్ తప్పా మరొకటి కాదు. ఇక్కడి ప్రజాప్రతినిధి అభివృద్ధి కోసం పార్టీ మారానని చెబుతున్నారని, అయితే ఈ బడ్జెట్‌లో నెట్టెంపాడ్ పరిధిలో పెండింగ్ పనులకు ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలి.

*- నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీఆర్‌ఎస్ నేత, జోగులాంబ గద్వాల జిల్లా*

### గట్టు ఎత్తిపోతలను పూర్తిచేయాలి

గట్టు, జూలై 25 : అధిక మొత్తంలో నిధులు కేటాయించి గట్టు ఎత్తిపోతలను పూర్తి చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గట్టులోని గురువారం సందర్శించిన ఆయన స్థానిక రైతులతో కలిసి మాట్లాడారు. గట్టు ఎత్తిపోతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కేటీదొడ్డి, గట్టు మండలాల రైతులను ఆదుకోవాలని కోరారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల సమస్యలను పట్టించుకోవాలన్నారు. రుణమాఫీ విషయంలో కూడా కాంగ్రెస్ విధానం చెప్పిందొకటి చేస్తున్నదొకటిగా ఉందని ఎద్దేవా చేశారు.




రైతులతో కలిసి మాట్లాడుతున్న గోపాల్



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

## జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై

# నెగ్గిన అవిశ్వాసం

- చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన లక్ష్మి
- అవిశ్వాసానికి అనుకూలంగా 26 ఓట్లు
- ఆర్డీవో సమక్షంలో నిర్వహణ

జడ్చర్ల, జూలై 25 : జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మిపై గురువారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో దోరెపల్లి లక్ష్మి చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారు. ఏ ఒక్క కౌన్సిలర్ కూడా చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఓటు వేయకపోవడం గమనార్హం. జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఒంటరి పోకడలు పోతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గత నెలలో కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని నోటీసు ఇచ్చారు. వారి వినతి మేరకు జూలై 25న అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో నవీన్, కమిషనర్ రాజయ్య సమక్షంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. జడ్చర్ల మున్సిపాలిటీలో మొత్తం 27మంది కౌన్సిలర్లు ఉండగా అందులో చైర్‌పర్సన్ లక్ష్మి గైర్హాజరు కాగా ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ (19), కాంగ్రెస్ (6), బీజేపీ (1)కు చెందిన 26 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అందరూ ఒకే వాహనంలో నేరుగా కార్యాలయానికి వచ్చారు. అవిశ్వాసానికి అనుకూలంగా 26 మంది చేతులు లేపి తమ మద్దతు ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్ లక్ష్మిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్టు ఆర్డీవో నవీన్ ప్రకటించారు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచే అవిశ్వాసం ఎదురవడం, చైర్‌పర్సన్‌పై వ్యతిరేకత ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు కూడా అవిశ్వాసానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సూచన మేరకు తమ పార్టీ కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో చైర్మన్‌ను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్, దేవా, లత, చైతన్య, సారిక ఉన్నారు.

### తృటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

పాన్‌గల్, జూలై 25 : ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో మరో ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ సందర్భంగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిన ఘటన గురువారం తెల్లరాళ్లపల్లితండా సమీపంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. గురువారం కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వనపర్తికి వస్తుండగా మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారి ఇచ్చే క్రమంలో రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యం వ్యవహరించడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఒకరిద్దరికి మాత్రమే స్వల్ప గాయాలు కావడంతో ఆందోళన ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# మహా ప్రవాహం

- జూరాల, టీబీ డ్యాంకు భారీ వరద
- పీజేపీ 46 గేట్ల ద్వారా 2.25 లక్షల క్యూసెక్కులు విడుదల
- తుంగభద్ర డ్యాం 28 గేట్ల ఎత్తివేత



టీబీ డ్యాం గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

గద్వాల, జూలై 25 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గడం లేదు. మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉరకలు వేస్తున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు ఇప్పటికే నిండుకుండలా మారడంతో వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి 2,27,000 క్యూసెక్కులు జూరాలకు వస్తుండగా గురువారం 46 గేట్లు ఎత్తి దిగువకు 2,25,354 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా కొనసాగుతుంది. ఎగువన ఐదు యూనిట్లు, దిగువన ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 316.580 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకుగాను ప్రస్తుత నీటి నిల్వ 6.065 ఉన్నది. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 19,516 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 1300, భీమా లిఫ్ట్-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 458 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**టీబీ డ్యాంకు 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

అయిజ, జూలై 25 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద వచ్చి చేరుతుండడంతో 28 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం టీబీ డ్యాంలోకి ఇన్‌ఫ్లో 96,538 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 90,318 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం పూర్తిస్థాయి నీటి మట్టం 102.576 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1632.20 అడుగులు ఉన్నట్లు టీబీ డ్యాం ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. టీబీ డ్యాం నుంచి దిగువకు ఉరకలేస్తూ ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి సుంకేసుల మీదుగా శ్రీశైలం వైపునకు పరుగులు తీస్తున్నది.

**ఆర్డీఎస్ ఆనకట్టకు..**

టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు వరద ప్రవాహం మొదలైంది. ఆనకట్టకు 2,368 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 224 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోందని కర్ణాటక ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8 అడుగుల మేర నీటి నిల్వ ఉందని, ఆర్డీఎస్ నుంచి సుంకేసుల బ్యారేజీ వరకు వరద నీరు చేరుతున్నాయని, ప్రాజెక్టు నుంచి జూలై నెలలోనే వరద వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు..**

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లోకి ఇన్ ఫ్లో చేరుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2,04,167 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్ ఫ్లో 2,75,000 ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గానూ ప్రస్తుతం 1695.10 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 86.08 ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 2,70,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 2,70,120 క్యూసెక్కులు ఉంది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1605.00 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ 26.584 టీఎంసీలు ఉన్నది.

**బోటు ప్రయాణం నిలిపివేత**

మక్తల్, జూలై 25 : కృష్ణానదికి ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో కృష్ణానదికి భారీగా వరద వస్తున్నది. దీంతో మక్తల్ మండలం పస్పుల, పంచదేవపహాడ్ ఉమ్మడి మండలం వద్ద కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. కృష్ణానది నుంచి ఇప్పటి వరకు 60 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. కృష్ణానది నిండుగా ప్రవహిస్తుండడంతో కృష్ణానది అవతలి ఒడ్డున ఉన్న దత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు బోటు ప్రయాణాన్ని అధికారులు నిలిపివేయడంతో భక్తులు నిరాశతో వెనుదిరిగారు. నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**కొనసాగుతున్న పంపింగ్**

రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా భీమా ఫేజ్-1లోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లకు పంపింగ్ కొనసాగుతున్నది. భీమా ఫేజ్-1లోని స్టేజ్ వన్ పంప్ హౌస్ నుంచి 1300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయగా సమాంతర కాల్వ ద్వారా భూత్పూర్ రిజర్వాయర్‌కు 500, తిరుమలాయపల్లి చెరువు నుంచి స్టేజీ-2 ద్వారా సంగంబండ రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. గురువారం నాటికి సంగంబండ రిజర్వాయర్ 1.88 టీఎంసీలు, భూత్పూర్ రిజర్వాయర్‌లో 0.7 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, వీటి నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కుల చొప్పున సాగునీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న పాడి రైతులు

# పాల బిల్లులు చెల్లించాలి

- కల్వకుర్తి -హైదరాబాద్ ప్రధాన రహదారిపై పాడి రైతుల ధర్నా

కల్వకుర్తి, జూలై 25 : రెండు నెలలుగా బకాయి ఉన్న పాలబిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం పాడి రైతులు కల్వకుర్తి పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రం ఎదుట కల్వకుర్తి -హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలు పోస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలబిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు చూసినా రెండు నెలలకు పైగా బిల్లులు బకాయి ఉంటున్నాయని వాపోయారు. ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉండగా రెండు నెలల బకాయిలను తమ వద్దే ఉంచుకొని విజయ డెయిరీ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తాము పోసిన పాలకు బిల్లులు చెల్లించకుండా మమ్మల్ని ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇదేనా రైతు ప్రభుత్వమంటే అని రైతులు ప్రశ్నించారు. పాలబిల్లులు సక్రమంగా రాకపోవడంతో పశువుల మేత, ఇతర ఖర్చులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పాల బిల్లులు చెల్లించకుండా ఆపడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని, డబ్బులు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇదే సమయంలో పాల బిల్లులు కూడా రాకపోవడంతో తమ బాధలు వర్ణనాతీతమని రైతులు వాపోయారు. రెండు నెలలకు నాలుగు బిల్లులు బకాయి ఉన్నాయని, వెంటనే బకాయిలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. రూ.4 ప్రోత్సాహకం ఊసే ఎత్తడం లేదని రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గురించి ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు తమ గొప్పలను ప్రదర్శించేందుకు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మా బతుకు దెరువు పాడి అని, పాడిలోనే బతుకుతున్నామని, పాలబిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తమను రోడ్డు పాలు చేసిందని తీవ్రంగా మండిపడ్డారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి, వెల్దండ, వంగూర్, పాలకొండ, ఉర్కొండ మండలాలకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.